తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# అనుబంధాలు //// శ్రీవిరించి



సాయం కాలం. అప్పుడే అయిదు గంటలుఅవుతోంది.

టీ తాగి బల్ల ముందునుంచి లేస్తూఉండగా అంది ఆమె, "ఉదయం నుంచియింట్లోనేవున్నారు, కూర్చున్న మనిషి కూర్చున్నట్లే వున్నారు; కాళ్ళు కదుములు కడతాయి. కాస్త అటు యిటుతిరిగి రాకూడదూ?"

అతనేమీ మాట్లడలేదు.

"మళ్ళీ ఆరు గంటలయిందంటే చీకటి కమ్ముకు వచ్చేస్తుంది. పదండి, ఒక్క అరగంట అలా రోడ్డు మీదదాకా నడిచి వద్దాం..." అంది, ఆమె మళ్ళీ.

'ఓహో, అయితే ఆమెకు ఈ సాయంకాలం షికారు చేయాలని వున్నదన్నమాట'— అనుకున్నాడు అతను.

ఈ రోజు మధ్యాహ్నం కొద్దిగా డబ్బు వచ్చింది. దాన్ని తీసుకుపోయి బ్యాంక్‌లో పడేయాలి. అర్జంట్ అవసరాలు యేమయినా వుంటే కొద్దిగా దగ్గర పెట్టుకోవాలి.

"అలాగే వెడదాం. బ్యాంక్‌లో కాస్త పని కూడా వుంది. తొందరగా బయలుదేరు మరి —" అన్నాడు.

"బ్యాంక్ అంటే గుర్తు వచ్చింది–ప్రొవిజన్ షాపులో బిల్ పే చేయాలి, డబ్బు తీసుకురండి. చెక్ యిచ్చినా సరే, మీ యిష్టం" అంది ఆమె బయలుదేరుతూ.

అయిదువందలు లెక్కబెట్టి జేబులో వేసుకున్నాడు.

ప్రొవిజన్ షాపు బిల్ రెండు వందల నలభయి ఎనిమిది రూపాయల అరవయి రెండు పైసలు. పోతే మిగతాది బ్యాంక్‌లో వేసేయవచ్చును.

ఈ రోజుల్లో అంతా విచిత్రం! బ్యాంక్‌లు ఉదయం పూటే తప్ప సాయంకాలం పని చేయవు. ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 12.30 దాకా పనిచేసి తరువాత షట్టర్స్ మూసేస్తున్నారు ప్రతివాళ్ళూ. అందరికీ విశ్రాంతి గంటలు ఎక్కువ కావలసి వస్తున్నాయి, పని గంటల కంటే!

ఉదయం బ్యాంక్‌కు వెళ్ళాలంటే కుదరదు, అసలు బయటకు బయలుదేరితే ఆ రోజంతా హరించిపోయినట్లే.

అందుకనే యింకా 'సత్య' కాలంలోనే వుండి సాయంత్రం కూడా రెండు గంటలపాటు పనిచేసే ఒక బ్యాంక్ బ్రాంచ్ పనిగట్టుకుని కనిపెట్టాడు, యిటీవల. గవర్నమెంట్ బ్యాంక్ కాదు. అయినా 'ఫరవాలేదు. మన నిధి నిక్షేపాలు మటుమాయం అయిపోవు —' అనుకున్నాడు.

రోడ్డంటే నడుస్తూ వుంటే - ఆలోచనలు వస్తున్నాయి. బ్యాంక్‌లో ఎంత జమ వేస్తే బాగుంటుంది? ప్రొవిజన్ స్టోర్స్ బిల్ రెండు వందల యాభై అనుకో... రౌండ్ ఫిగర్ వేస్తే, ఇంక ఆప్షన్ ఎక్కడుంది? మిగిలిన రెండు వందల యాభయి బ్యాంక్‌లో సమర్పించి నమస్కారం చేస్తే సరిపోతుంది. మరి... చేతిలో యేమన్నా పదీ పరకా వుంచుకోవాలి గదా... అవసరం లేదా?



ఆలోచించుకుంటూ వుండగానే బ్యాంక్ గేటు రానే వచ్చింది.

ఆమెతో సహా లోనికి వెళ్లాడు.

పే - యిన్ - చలాన్ ఫాం తీసుకుని నింపాడు.

రెండు వందల ... ఒక క్షణం ఆలోచించి, ... యిరవై రూపాయలు అని నింపాడు.

పాస్ బుక్, చలాన్ ఫాం కౌంటర్లో అందించాడు ముందు. బ్యాంక్‌లో ఎవరూ కస్టమర్లు లేరు. మేనేజర్‌తో సహా సిబ్బంది అంతా రికామీగా కూర్చుని వున్నారు.




తరువాత జేబులో నుండి అయిదు కాగితాలు తీశాడు.

మూడు కాగితాలు యిస్తే చాలు. ఏ మూడు యివ్వాలి?... అయిదు లోను ఒకటి తెగ మాసిపోయివుంది; కాస్త 'ఆడ్' సైజ్‌లో వున్నది కూడా తతిమా వాటితో పోల్చి చూస్తే. ఆ కాగితాన్ని ప్రావిజన్ షాపులో యివ్వడమా లేక బ్యాంక్‌లో జమ చేయడమా ?... రెండు క్షణాలు తికమకపడి దాన్నీ, మరి రెండు కాగితాలను - కౌంటర్లో క్యాషియర్‌కు అందించాడు. క్యాషియర్ యథాలాపంగా అందుకున్నాడు కాగితాలు.

అతను పక్కకు తిరిగి చూశాడు. ఆమె తనకు యిదంతా ఏమీ పట్టనట్లుగ్గా, ఏ మాత్రం సంబంధం లేనట్లుగ్గా ఒక సోఫాలో శరీరాన్ని వాల్చింది. తనకోసంఎదురుచూస్తూకూర్చుంది. అతను వెంటనే అటు అడుగులు వేసి ఆమె పక్కన కూర్చున్నాడు.

ఒక నిమిషం, ముప్ఫయి తొమ్మిది సెకన్లలో బ్యాంక్ ట్రాన్సాక్షన్ పూర్తయి పోతుంది యిక్కడ, బ్యాంక్ వాళ్లు చేసే ప్రకటనప్రకారం నిజానికి అంత మాత్రం 'టైం' కూడా పట్టలేదు యిప్పుడు.

ఆఫీసరు తనను పిలిచి బ్యాంక్ ప్యాస్ బుక్, చలాన్ కౌంటర్ ఫాయిల్ యిచ్చాడు. ఇస్తూ, "ఎకౌంట్ నెంబర్ తప్పు వేశారు మీరు, కరెక్టు చేశాం. చూచుకోండి. జాగ్రత్త"అన్నాడు.

భయపడినట్లుగ్గా పక్కకు తిరిగి చూచాడు.

కౌంటర్లో కాషియర్ తన వయిపేఆత్రంగా చూస్తూ "రండి" అన్నాడు. అటు అడుగు వేయగానే నాలుగు యిరవయి రూపాయలనోట్లు అందించాడు. "ఛేంజ్ తీసుకోలేదు మీరు" అన్నాడు.

అప్పుడు గుర్తు వచ్చింది అతనికి, సోఫాలో ఆమె పక్కన కూర్చోవాలనే తొందరలో చిల్లర నోట్లు తీసుకోవడమే గమనంలేకుండాపోయింది. 'నయం! క్యాషియర్ ఎంత మంచివాడు! మరొ కళ్లు అయితే యనభయి రూపాయలకు ఖర్చు రాసేసుకోవలసి వచ్చేది!'

"థ్యాంక్స్"అంటూ అందుకున్నాడు; మరచిపోయాను - అన్న భావం ముఖంలో కనబడనీయ కుండా. తన డబ్బు ఎక్కడకు పోయినా పువ్వుల్లో పెట్టి మరీ వస్తుంది!

" వెడదామా - " అన్నాడు ఆమెతో, తతిమ్మా కాగితాలు, ప్యాస్ బుక్ వగయిరా జేబులో సర్దుకుంటూ.

మరో నాలుగు అడుగుల్లో ప్రావిజన్ షాప్ వచ్చేసింది.

లోనికి వెళ్ళారు యిద్దరూ.

"రండి. రండి..." ... మంచి స్వాగతం. రెండు వంద కాగితాలు, మూడు యిరవయి కాగితాలు తీసి యిచ్చాడు బిల్‌తోపాటు.షాపతను "మీరే పట్టుకువచ్చారే. సంతోషం-" అన్నాడు. బిల్ మీద 'పెయిడ్' స్టాంప్ వేసి, చిల్లరతో తిరిగి యిచ్చాడు, "ఇప్పుడేమయినా కావాలా?" అని కేజువల్‌గా విచారిస్తూ.

"ఇంటికి వెళ్లేముందుమళ్లా వస్తాం. అప్పుడు బ్రెడ్ తీసుకోవాలి," అన్నాడు.

జేబులో యిప్పుడు యిరవయి రూపాయల ఎర్ర కాగితం, పదినోటు, తెల్లటి ఒక కాగితం, రెండు 'కొరియా' యిరవయి పయిసల నాణేలు వున్నాయి.

షాపు నుంచి బయటకు వచ్చాక, అప్పటి వరకు నడిచిన రోడ్డుకు 'లంబరేఖ'లో నడిచి సముద్ర తీరానికి వచ్చారు.

"ఈ రోజు పౌర్ణమి"అంది ఆమె, సముద్రం వేస్తున్న ఉరుకులు పరుగులు గమనించి. సముద్రపు గాలి వంటికి మంచిది!

ఎక్కువ యిసుకలోనికి పోకుండా గట్టునే పది నిమిషాలు అటు ఇటు నడిచారు.

చెదురుమదురుగా అక్కడక్కడ జనం.

ఈ చక్కటి వాతావరణం లో యిసుక రేణువులలా ఎక్కడ చూచినా బిల బిల లాడుతూ, మంచిగాలి పీల్చుకుంటూ తిరుగాడుతూ వుండవలసిన జనం...మరల కార్యాలయాలలో, సిటీ బస్సులలో, సినిమా హాళ్ళలో, బట్టల దుకాణాలలో... బిగిసిపోయి బీచికి రాలేకపోయారు — అనుకుని నిట్టూర్పు విడిచాడు.

ఆమె అంది:"ఈ రోజు చాలా పనిచేశారు. సాయంకాలం యిలా ఓ అరగంట తిరిగి రావడం ఆరోగ్యానికి మంచిది. రోజూ యిలా చేయగలిగితేబాగుండును!"'ఎందుకు చేయకూడదు... చేయవచ్చునే...'అనిపించింది అతనికి.

అయినా ఎందుకు చేయడం లేదో తెలియదు.

బయలుదేరుదాం... అనుకుంటూ వుండగానే, రాస్తూవున్న వ్యాసమో, కథో మధ్యలో బల్ల మీద పడేసి లేవగల 'నిరాసక్తత' లేక అంతకంటే ముందు బయలుదేర లేకపోతాడు. జీవితం నాలుగు గోడలకు పరిమితం అయిపోతోంది.

'బయటి ప్రపంచంతో బొత్తిగా అనుబంధం లేకుండా పోతోంది...ఉహూ, యిలా అయితే లాభం లేదు —'— అనిపిస్తుంది ప్రతిమారూ.

బయటి ప్రపంచానికి తనకూ విజిబుల్ లింక్ — కనిపిస్తున్న వంతెన — వార్తాపత్రికలు, టి.వి.లో వచ్చే స్పాన్సర్డ్ ప్రోగ్రామ్స్.

ఏ మంత్రి యే క్షణాన రాజీనామా చేయవలసినట్టు పార్టీ పనికి పరిమితం అయిపోతాడో — తెలుసుకుంటేనేం, లేకపోతేనేం! గవర్నర్ల నియామకాలు, రాష్ట్రాలలో భాషా — మతం పేరుతో జరుగుతున్న కల్లోలాలు...విని విని మామూలు మాటలు అయిపోయాయి.

'స్పాన్సర్డ్ ప్రోగ్రామ్స్' చూస్తూవుంటే జీవితాన్ని ఎలా నియమబద్ధం చేసుకోవాలో స్పష్టం అవుతోంది. ఏ 'టీ' తాగాలి, ఏ' సిగరెట్' కాల్చాలి, ఏ రకం 'దుస్తులు' వేసుకోవాలి, చివరకు యే 'మిల్క్ చాక్‌లెట్' తినాలి అనేది గూడా...వాళ్ళే, ఆ పని తాలూకు సకల సౌకర్యాలు, సదుపాయాలు వివరించి మరీ చెబుతారు.

"అన్నట్లు...మిల్క్ చాక్‌లెట్ కావాలన్నావు గదూ?"

— బ్రెడ్ కలెక్టు చేసుకుంటూ, ఫలానా కంపెనీ తాలూకు కొత్త ప్యాక్ మిల్క్ చాక్‌లెట్ కూడా తీసుకున్నాడు. రెండూ చేతిలోనే దొరకపుచ్చుకుని యింటి వయిపు దారితీశాడు. చేతినిండా అమరివున్న బ్రెడ్ ప్యాకెట్ మీద లేత నీలిరంగులో అందమయిన ముద్రణలో సుందరంగా — అందులో యిరవయ్యో వంతు మాత్రమే వున్న చాక్‌లెట్ ప్యాకెట్ పట్టుకు నడుస్తూ వుంటే జీవితం మధ్యాహ్నపు ఎండ లాగ, సముద్ర కెరటంలాగ, సులలితమయిన సుందర స్వప్నంలాగ జాలువారుతోంది. ●